
# ఉపాయం

- ఆముదాల అజయ్‌బాబు




నగరంలో పేరు మోసిన ఒక బ్యాంకులో కోటి రూపాయలు దోపిడీ చేసి చాలాకాలంగా తప్పించుకు తిరుగుతున్నాడు ఆ దొంగ. ఆ దొంగ వయసు ముప్పై ఏళ్ళు ఉంటాయి. పొడవుగా, దృఢంగా ఉంటాడు. ఎట్టకేలకు పోలీసులు తీవ్రంగా గాలించి ఆ దొంగని పట్టుకున్నారు. కానీ ఫలితం లేదు. ఆ దొంగ దోపిడీ చేసిన కోటిరూపాయలు ఎక్కడ దాచాడో చెప్పడంలేదు. అసలు నోరే విప్పడం లేదు. ఆ దొంగతో పోలీసులు విసిగి వేసారిపోయారు.

ఆరోజు సాయంత్రం ఆ దొంగ తల్లిని స్టేషన్‌కి తీసుకొచ్చారు పోలీసులు.

సిఐ జమదగ్ని ముందు నిలబెట్టారు. ఆమె వృద్ధురాలు.

"కోటిరూపాయలు ఎక్కడ దాచారు? మర్యాదగా చెబుతావా. నిన్ను కూడా లాకప్‌లో వేయమంటావా?"కోపంగా అరిచాడు జమదగ్ని.

"నన్ను నమ్మండి బాబూ. ఆ డబ్బు సంగతి నాకు తెలీదు" అంటూ వృద్ధురాలు కన్నీళ్ళు పెట్టుకుంది.

"తల్లీ కొడుకులు బాగానే నాటకాలాడుతున్నారు. ఇది రవీంద్రభారతి అనుకుంటున్నారా?" గద్దించాడు జమదగ్ని.

వృద్ధురాలు బాధపడింది. భయపడింది. కొంచెంసేపు దీర్ఘంగా ఆలోచించింది.

"ఆ కోటిరూపాయలు దోపిడీ నా కొడుకే చేశాడని మీరు నమ్మితే వాడి నోట్లోంచి నిజం రప్పించే మార్గం ఉంది" అంటూ చెప్పింది.

"మార్గమా? ఏమిటది?"ఆత్రంగా అడిగాడు జమదగ్ని.

వృద్ధురాలు చెప్పింది.

"ఎలా కన్పిస్తున్నాను నీకంటికి?" అంటూ వృద్ధురాలి వంక కన్నెరచేశాడు జమదగ్ని.

"నేను చెప్పేది నిజం" దృఢంగా అంది వృద్ధురాలు.

వృద్ధురాలు వంక అనుమానంగా చూస్తూ ఓ పోలీసుని పిలిచి కిరాణాకొట్టుకి పంపించాడు జమదగ్ని.

అయిదు నిముషాల్లో ఒక పెద్దసీసాతో తిరిగొచ్చాడు పోలీసు.

వెంటనే ఆ సీసాను తీసుకుని ఇంటరాగేషన్ రూంకి వెళ్లాడు జమదగ్ని.

కాళ్లకి, చేతులకీ సంకెళ్ళు వేసి ఉన్న ఆ దొంగ ముక్కు ముందు ఆ సీసా మూత తెరిచాడు జమదగ్ని. గుప్పుమంటూ వస్తున్న సీసాలోని ఆ వాసనకి ఆ దొంగ బెదురుగా కళ్ళు తెరిచాడు.

"వద్దూ...దగ్గరికి రావొద్దూ. తాగించొద్దూ" అంటూ త్రాచుపాముని చూసినట్టుగా ఆ సీసాని చూస్తూ అరవసాగాడు ఆ దొంగ.

"అయితే నిజం చెప్పు. ఆ కోటిరూపాయలు ఎక్కడ దాచావ్?"అడిగాడు జమదగ్ని.

"చెబుతాను. చెబుతాను.." అంటూ ఆ దొంగ దోపిడీ చేసిన ఆ కోటిరూపాయలు ఎక్కడ దాచాడో జమదగ్నికి వివరంగా చెప్పాడు.

వెంటనే సి.ఐ జమదగ్ని తన సిబ్బందితో బయలుదేరాడు. ఆ దొంగ చెప్పిన ప్రదేశానికి చేరుకుని ఆ కోటిరూపాయలు స్టేషన్‌కి తీసుకొచ్చాడు. ఈ విషయంపై అధికారులకి తెలియపర్చాడు.

ఇంతకీ ఆ సీసాలో ఉన్నది ఏంటో అని అంతా ఆసక్తిగా చూశారు. తన కొడుక్కి ఆముదం అంటే ఎలర్జీ అని ఆ వృద్ధురాలు చెప్పిన చిట్కాని ఆచరణలో పెట్టి పెద్ద దొంగని, దోపిడీ సొత్తుని స్వాధీనం చేసుకున్నాడు జమదగ్ని.

★